సాక్షి
పెద్దపల్లి
మంగళవారం । 1 । అక్టోబర్ । 2024

కాలేజీలో బతుకమ్మ వేడుకలు

మంథని: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు బతుకమ్మ సంబురాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ వేడుకలు తెలంగాణ జీవనశైలి, సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ సౌందర్యం గురించి తెలియజేస్తాయని మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమ అన్నారు. ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పరిషయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



మేము 'ఆగం'

ద్విచక్రవాహనాలపై పరిమితికి మించి ఇలా ప్రయాణిస్తున్నారు. ఇందులో వయసు పైబడిన వారితోపాటు మైనర్లు ఉన్నారు. విద్యా సంస్థలకు దసరా సెలవులు ప్రకటించడంతో సరదా కోసం కొందరు మైనర్లు తమ తల్లిదండ్రుల కళ్లుగప్పి బైక్‌లు తీసుకుని ఇలా రోడ్లెక్కుతున్నారు. ట్రాఫిక్‌లోనే విన్యాసాలు ప్రదర్శిస్తున్నారు. ఈఏడాదిలో ఇప్పటివరకు 524 ప్రమాదాలు జరిగి 169 మంది చనిపోయారని, విన్యాసాలు ప్రదర్శించొద్దని పోలీసులు ప్రచారం చేస్తున్నా.. 'మేము ఆగం' అంటూ ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తూ వాహనదారులు ఇలా రయ్.. రయ్‌మంటున్నారు.





- ఎవరు చెప్పినా వినం.. నిబంధనలు పాటించం
- పోలీసులు నియంత్రించినా ఆగని ఉల్లం'ఘనులు'
- ద్విచక్రవాహనాలపై పరిమితికి మించి ప్రయాణం
- రహదారులపైనే మైనర్లు, విద్యార్థులు, యువత విన్యాసం
- యథేచ్ఛగా ట్రాఫిక్ నిబంధనల అతిక్రమణ
- తనిఖీలతో అధికారులు కట్టడి చేస్తున్నా మారని వాహనదారుల తీరు

సాక్షి, పెద్దపల్లి: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే పోలీసులు జరిమానా విధిస్తున్నా కొందరు వాహనదారుల్లో మార్పు రావడం లేదు. చాలామంది యథేచ్ఛగా రూల్ ఉల్లంఘిస్తూనే ఉన్నారు. తమతో పాటు ఎదుటి వారికి ప్రమాదమని తెలిసినా రోడ్లపైనే విన్యాసాలు ప్రదర్శిస్తున్నారు. టూవీలర్‌పై ఇద్దరికి మించి ప్రయాణించకూడదనే నిబంధన జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. కొన్ని సందర్భాల్లో ఏకంగా నలుగురైదుగురూ ప్రయాణిస్తున్నారు. ఇలా కొందరి నిర్లక్ష్యంతో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

హెల్మెట్ ధరించడంపై నిర్లక్ష్యం

జిల్లాలో చాలామంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఈ తప్పిదంలో యువకులు ముందువరుసలో ఉంటున్నారు. దీనికితోడు రహదారులపై అతివేగంతో వాహనాలు నడుపుతున్నారు. తలపై వెంట్రుకలు రాలుతాయని, ముఖం కనిపించదనే కారణాలతో హెల్మెట్ వాడేందుకు యువత పెద్దగా ఆసక్తి చూపడంలేదు. మరికొందరు తలపై ఉంచాల్సిన హెల్మెట్‌ను వాహనానికి తగిలిస్తున్నారు. ఇంకొందరు అసలు హెల్మెట్ ధరించాలనే నిబంధన ఒకటుందన్న విషయమే గుర్తుంచుకోవడం లేదు. గత మూడేళ్లలో రామగుండం కమిషనరేట్ పరిధిలో అత్యధికంగా 10,61,268 కేసులు నమోదవడమే ఇందుకు నిదర్శనమని అధికారులు వివరిస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు అధికం..

కొద్దిరోజులుగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు జిల్లాలో అధికంగా నమోదవుతున్నాయి. బ్రీతింగ్ అనలైజర్‌తో పోలీసులు నిరంతరం వాహన తనిఖీలు చేస్తున్నారు. ఆల్కహాల్ 36 శాతం మించితే కేసు నమోదు చేస్తున్నారు. అయితే, కొన్నిసందర్భాల్లో రక్తంలో ఆల్కహాల్ 300శాతానికి పైగా నమోదవుతోందని పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత మూడేళ్లలో రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో 48,415 కేసులు నమోదయ్యాయని వివరిస్తున్నారు. ఇందులో 18 ఏళ్లలోపు వారు 68 మంది, 18 – 20 ఏళ్లలోపు వారు 692 మంది, 21 – 30 ఏళ్లలోపు వారు 15,899 మంది, 31 –40 ఏళ్లలోపు వారు 16,884 మంది, 41 – 50 ఏళ్లలోపు వారు 9,868 మంది, 51 – 60 ఏళ్లలోపు వారు 930 మంది, 61 ఏళ్ల పైబడిన వారు 1,001 మంది ఉన్నారని వారు పేర్కొంటున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఎక్కువగా 21 ఏళ్ల – 40 ఏళ్ల వారే మద్యం మత్తులో పట్టుబడుతున్నారని అంటున్నారు.

ఇద్దరికి మించి ప్రయాణం నిషేధం

ద్విచక్ర వాహనంపై ఇద్దరికి మించి ప్రయాణం చేయకూడదనే నిబంధన ఉంది. ఈ నిబంధన ఉల్లంఘిస్తే పోలీసులు జరిమానా విధిస్తున్నారు. అయినా, కొందరు వారి కళ్లుగప్పి డ్రైవింగ్ చేస్తున్నారు. ద్విచక్రవాహనంపై ఎక్కువ మంది ఉంటే ప్రమాదాన్ని తప్పించడం సాధ్యం కాదు. బ్రేకులు పడక క్షణాల్లో వాహనం అదుపుతప్పుతుంది. ఇలాంటి ప్రమాదాల్లో బాధితులకు బీమా సౌకర్యం కూడా వర్తించడం లేదని పోలీసులు చెబుతున్నారు.

మూడేళ్లల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలు

మొత్తం ప్రమాదాలు	2,008
మృతులు	702
తీవ్ర గాయాలైనవారు	314
స్వల్ప గాయాలైనవారు	1,582

మూడేళ్లలో నమోదైన కేసులు

మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్	8,931
అతివేగం	64,109
ట్రిపుల్ రైడింగ్	17,311
లైసెన్స్ లేనివి	95,045
ధ్రువీకరణ పత్రాలు లేనివి	23,270
హెల్మెట్ లేనివి	10,61,268
అడ్డదారిలోనివి	25,024

వాహనదారుల్లో మార్పు రావాలి

తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు. తనిఖీల్లో పట్టుబడితే వాహనం సీజ్‌చేసి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తాం. నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడపవద్దు. ద్విచక్రవాహనంపై ఇద్దరికి మించి ప్రయాణించిన సందర్భాల్లో ప్రమాదం జరిగితే బీమా సౌకర్యం వర్తించదు. ఈ విషయాలపై పోలీస్‌శాఖ ద్వారా అవగహన కల్పిస్తున్నాం. వాహనాదారుల్లో సైతం ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించవద్దనే మార్పు రావాలి.

– నర్సింహులు, ఏసీపీ, ట్రాఫిక్



న్యూస్‌రీల్

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి గణేశ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జడ్జి గణేశ్ సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో సోమవారం చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో న్యాయవాదులు, సిబ్బందితో కలిసి కోర్టు ఆవరణ శుభ్రం చేశారు. జడ్జి మాట్లాడుతూ, పరిసరాలు అపరిశుభ్రంగా దోమలు, ఈగలు వృద్ధి చెంది వ్యాధుల బారినపడతామన్నారు. సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి జొగుల రమేశ్, న్యాయవాదులు భూమయ్య, రవీందర్, సత్యనారాయణ, తిరుపతిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: ప్రజావాణికి అందిన అర్జీలకు సత్వరమే స్పందించి పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వారు పాల్గొని అభాగ్యుల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖల అధికారులు వాటిని పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



పరిచయం చేసుకుంటున్న డీఈవో మాధవి

ఎలిగేడు(పెద్దపల్లి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం చేపట్టిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలను జిల్లా విద్యాధికారి మాధవి ప్రారంభించారు. డీఈవో మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులు మానసిక, శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. రామగుండం, సుల్తానాబాద్, పెద్దపల్లి, మంథని డివిజన్ల నుంచి సుమారు 200 మంది బాలబాలికలు పోటీలకు హాజరయ్యారు. ఏఎంవో షేక్, ఎంఈవో కవిత, హెచ్‌ఎం దేవేందర్‌రావు, ప్రతినిధులు మాధురి, లక్ష్మణ్, రమేశ్, రవి, పీడీలు ప్రణయ్‌కుమార్, హరికృష్ణ పాల్గొన్నారు.

టీబీని జయించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

సుల్తానాబాద్‌రూరల్: అవగాహనతోనే టీబీని జయించవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్‌కుమార్ అన్నారు. టీబీబాధితులు వైద్యుల సూచనలు, సలహాలను క్రమం తప్పకుండా పాటిస్తూ, మందులు వాడితో వ్యాధి దూరమవుతుందని తెలిపారు. గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో టీబీ అలెర్ట్ ఇండియా ఆధ్వర్యంలో ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ తరపున సోమవారం నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. వ్యాధిని జయించిన వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. డిప్యూడీ డీఎంహెచ్‌వో శ్రీరాములు, వైద్యులు సుధాకర్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కుటుంబానికి పరామర్శ



మంత్రిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ సోమవారం పరామర్శించారు. మంత్రి తండ్రి పురుషోత్తమ్‌రెడ్డి మృతికి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఠాకూర్ సతీమణి మనాలీఠాగూర్ తదితరులు ఉన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ధర్మారం(ధర్మపురి): స్థానిక తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ కొమురయ్య సోమవారం తెలిపారు. ఇందులో మనోజ్ఞ, ఆర్. పవిత్ర, ఆర్.సిరి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 6 – 9వరకు మెదక్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరపున వీరు పాల్గొంటారని వివరించారు.

పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



పదోన్నతి పొందిన అధికారులతో సీపీ శ్రీనివాస్, అధికారులు

గోదావరిఖని: పదోన్నతితోపాటే బాధ్యత మరింత పెరుగుతుందని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. ఏఎస్ఐ నుంచి ఎస్ఐగా పదోన్నతి పొందిన ఆరుగురు పోలీసు అధికారులను సీపీ తన కార్యాయలంలో సోమవారం అభినందించారు. అనంతరం వారికి ర్యాంక్ పదోన్నతి చిహ్నం అలంకరించి మాట్లాడారు. పదోన్నతి పొందిన పోలీసు అధికారులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి పోలీస్‌శాఖపై నమ్మకం, గౌరవం పెంచాలని సీపీ సూచించారు. ఇదేసమయంలో ప్రతీఒక్కరు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటారని, మానసికంగా, శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి ఇది ఎంతో దోహదం చేస్తుందని పోలీసు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సి.రాజు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్‌రావు, ఆర్‌ఐలు దామోదర్, మల్లేశం, వామనమూర్తి, సంపత్, శ్రీనివాస్, సూపరింటెండెంట్లు ఇంద్రసేనారెడ్డి, మనోజ్‌కుమార్, గౌస్, అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం తదితరులు పాల్గొన్నారు.

శేషజీవితం ఆనందంగా సాగాలి

ఉద్యోగ విరమణ పొందిన అధికారుల శేషజీవితంగా ఆనందంగా సాగాలని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ పోచయ్య, ఏఆర్ ఎస్ఐ కె.శ్రీనివాసులుతోపాటు వారి కుటుంబాలను సీపీ సన్మానించి మాట్లాడారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే విధులను విజయవంతంగా నిర్వర్తించి ఉన్నత స్థానాలకు ఎదిగారని ఆయన అన్నారు.

లోక్ అదాలత్‌లో 6,903 కేసులు పరిష్కారం

ఈనెల 28న నిర్వహించిన లోక్ అదాలత్‌లో 6,903 కేసులు పరిష్కారమైనట్లు సీపీ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ అధికారులు కక్షిదారుల రాజీ కోసం కృషి చేశారని ఆయన ప్రశంసించారు.

అందుబాటులో సహకార సేవలు



పెద్దపల్లి మండలం కనగర్తిలో గోదాము ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఇన్‌చార్జి డీసీవో రామ్మోహన్‌రావు, చింతపండు సంపత్

- రైతుల సంక్షేమానికి చర్యలు
- ఎమ్మెల్యే విజయరమణారావు, కేడీసీసీబీ చైర్మన్ 'కొండూరి'

పెద్దపల్లిరూరల్: సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందించడంతోపాటు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు పంపిణీ చేసేలా రైతులకు సహకార సేవలను అందుబాటులోకి తెచ్చామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం కనగర్తి గ్రామంలో రూ.25.60 లక్షల వ్యయంతో నిర్మించిన గోదామును కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సహకార వ్యవస్థ నీరుగారిపోయిందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో దండి(కాంటా)కొట్టి ఆనాటి పాలకులు వాటాలు పంచుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు కటింగ్ అనే పదానికి అవకాశమే లేకుండా రైతులు కష్టపడి పండించిన ప్రతీధాన్యం గింజను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని సర్కార్ సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించిందని గుర్తుచేశారు.

వ్యాపార రంగంలోనూ 'సహకారం'..

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న సింగిల్ విండోలు తాజాగా వ్యాపార రంగంలోనూ రాణిస్తున్నాయని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ సొసైటీ ఏటా రూ.200కోట్ల టర్నోవర్‌తో వ్యాపారం చేస్తూ ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు. అప్పన్నపేట సింగిల్‌విండో సూపర్ మార్కెట్ నిర్వహిస్తూ గ్రామస్తులు, రైతులకు నాణ్యమైన సరుకులను తక్కువ ధరలకే విక్రయిస్తోందని అన్నారు. ఇన్‌చార్జి డీసీవో రామ్మోహన్‌రావు, అప్పన్నపేట సింగిల్‌విండో అధ్యక్షుడు చింతపండు సంపత్, పాలకమండలి సభ్యులతోపాటు నాయకులు ఎడెల్లి శంకర్, కూర మల్లారెడ్డి, రామ్మూర్తి, జడల సురేందర్, రాజేందర్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

జిల్లాకు 93 ఉపాధ్యాయ పోస్టుల మంజూరు

పెద్దపల్లిరూరల్: జిల్లాకు డీఎస్సీ ద్వారా 93 ఉపాధ్యాయ పోస్టులు మంజూరయ్యాయని జిల్లా విద్యాధికారి మాధవి సోమవారం తెలిపారు. ఈమేరకు ఉపాధ్యాయ నియామకం కోసం నిర్వహించిన డీఎస్సీలో ఉత్తీర్ణులై మెరిట్ కేటగిరీలో 1:3 నిష్పత్తిలో 279 మంది అభ్యర్థుల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఈవో పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు వెరిఫికేషన్ కోసం మంగళవారం(ఈనెల 1) నుంచి 5వ తేదీ వరకు మండల విద్యాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. ఆ తర్వాత ఎట్టి పరిస్థితిలోనూ వెరిఫికేషన్ జరగదని డీఈవో స్పష్టం చేశారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జగదీశ్వర్, ముజీబ్ తదితరులు

జ్యోతినగర్(రామగుండం): తమ సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బొంకూరు శంకర్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించడం లేదని ఆరోపించారు. జోనల్ వ్యవస్థ జీవో నంబరు 317తో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సీపీఎస్ పెన్షన్ రద్దు చేయాలన్నారు. దసరాలోపు పెండింగ్ డీఏ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు ముజీబ్, దారం శ్రీనివాస్‌రెడ్డి, సందీప్‌రావు, ప్రవీణ్‌కుమార్, చంద్రశేఖర్ ఉన్నారు.

ప్రజల సహకారంతోనే గంజాయి నిర్మూలన

- గోదావరిఖని ఏసీపీ రమేశ్
- 5.2 కిలోల గంజాయి స్వాధీనం



మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్, సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని: ప్రజల సహకారంతోనే గంజాయిని పూర్తిగా నిర్మూలించవచ్చని గోదావరిఖని ఏసీపీ రమేశ్ అన్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక తిలక్‌నగర్‌డౌన్‌కు చెందిన తాండ్ర అవినాష్‌ను సోమవారం అరెస్ట్ చేశామని, అతడి నుంచి 5.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గత ఏప్రిల్‌లో బీరవేని అభిలాష్ ఉరఫ్ చంటి, అన్వర్, చిక్కుడు రాహుల్, తాండ్ర అవినాష్ కలిసి స్థానిక అడ్డగుంటపల్లి వద్ద గంజాయి విక్రయిస్తుండగా గంజాయి పట్టుకున్నామన్నారు. అప్పుడు 1.4కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని వివరించారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న తాండ్ర అవినాష్.. సెల్‌ఫోన్ నంబర్లు మార్చుకుని క్యాబ్ నడిపిస్తూ హైదరాబాద్‌లో ఉంటున్నాడని అన్నారు. గంజాయి తాగే అలవాటు ఉన్న ఇతడు ఒడిశాకు వెళ్లి అదే ప్రాంతానికి చెందిన అన్వర్‌తో కలిసి రూ.4,500 కిలో చొప్పున 5.5కిలోలు గంజాయి కొనుగోలు చేసి కొద్దిరోజుల పాటు హైదరాబాద్‌లో ఉన్నారన్నారు. అక్కడ పోలీసు నిఘా అధికం కావడంతో మహారాష్ట్రకు తీసుకెళ్లి విక్రయిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయనే ఆశతో బైక్‌పై అటు వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. గంజాయి కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన స్పెషల్‌పార్టీ సిబ్బంది భూమయ్య, హేమసుందర్, తీట్ల శ్రీనివాస్, రమేశ్, వెంకటేశ్, వేములవాడ శ్రీనివాస్‌కు ఏసీపీ రివార్డు అందజేశారు. సమావేశంలో ఎస్ఐ శ్రీనివాస్, అనూష తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

మంథని: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేషెంట్లతో మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీస్ అండ్ ఇన్స్యూరెన్స్ కోర్స్ ప్రవేశ పెట్టిన మంత్రి శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతగా ఆయన చిత్రపటానికి ఎన్ఎస్‌యూఐ పక్షాన క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ డివిజన్ అధ్యక్షుడు కెక్కర్ల సందీప్‌గౌడ్, మండల అధ్యక్షుడు జంజర్ల శైలేందర్, మున్సిపల్ కౌన్సిలర్లు గుండా విజయలక్ష్మి, వేముల లక్ష్మి, వీకే రవి, నాయకులు మంథని సురేశ్, ఎరుకల రమేశ్, నూకల కమల, సాధుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీధర్‌బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమ తదితరులు

ఓటరు నమోదుకు ఈసీ గ్రీన్ సిగ్నల్

- ఇక గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ పోరు
- వేడెక్కిన ఉత్తర తెలంగాణ రాజకీయం



సాక్షిప్రతినిధి,కరీంనగర్: పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియకు ఎలక్షన్ కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 6 వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగనుంది. డిసెంబర్ 30 తేదీన తుది జాబితా వెల్లడించనున్నారు. ప్రస్తుతం జరగనున్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్‌లలో ఈ ప్రక్రియ సోమవారం నుంచి ఊపందుకుంది. టీచర్, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ పడుతున్న ఆశావహులు ఓటరు నమోదు ప్రక్రియను ముమ్మరం చేశారు. పలు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పర్యటిస్తూ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలు ఒకప్పుడు నాలుగు జిల్లాలు అయినప్పటికీ ప్రస్తుతం 15 జిల్లాలుగా ఆవిర్భవించాయి. ఈ అన్ని జిల్లాలలోనూ గ్రాడ్యుయేట్లు, పలు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే బోధనా సిబ్బంది కీలకంగా మారారు. వీరిని ప్రసన్నం చేసుకునేందుకు ఆశావహులంతా పోటీ పడుతున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా దాదాపుగా అందరు నాయకులు స్వతంత్ర అభ్యర్థులుగానైనా పోటీచేసే ఉత్సాహంతో ఉన్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహనతో పాటు పలు వర్గాల మద్దతు కూడగట్టే విషయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభ్యర్థులే ముందుండడం గమనార్హం. సోమవారం నోటిఫికేషన్ వెలువడిన దరిమిలా వీరి సంఖ్య మరింత పెరగనుంది.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు ముత్యంరావు, కుమారస్వామి, భిక్షపతి, రామాచారి

పెద్దపల్లిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లాకార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం కార్మికులు, నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. యజమాన్యాలకు కార్మికులను బానిసలుగా మార్చేందుకు వీలుగా నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడం దుర్మార్గమన్నారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, కనీస వేతనాల జీవోను సవరించి నెలకు రూ.26వేల వేతనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని రైస్‌మిల్లుల్లో 8 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి పీఎఫ్, ఈఎస్ఐ, పింఛన్, బీమా తదితర సౌకర్యాలు వర్తింపజేయాలని కోరారు. నాయకులు కుమారస్వామి, భిక్షపతి, రామాచారి, అంజయ్య, రవీందర్, శంకర్, లక్ష్మారెడ్డి, మొగిలి, రాజమల్లు, ఖాజా, శ్రీనివాస్, ఉపేందర్, మంజూర్ బేగం, మల్లేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏపీఏ గని సందర్శన

రామగిరి(మంథని): ఆర్జీ–3 ఏరియాలోని ఏపీఏ గనిని సింగరేణి సంస్థ కార్పొరేట్ కోల్ కంట్రోల్ ఆర్గనైజేషన్ విభాగ అధికారి డీవీ సుబ్రహ్మణ్యం సోమవారం సందర్శించారు. జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి కొలిపాక నాగేశ్వరరావు, ఆయా విభాగాల అధికారులతో కలిసి బొగ్గు ఉత్పత్తిపై సమీక్షించారు. ఏపీఏ గని 3వ సీమ్‌కు సంబంధించిన వివిధ పనుల అనుమతులు, ఇతర అంశాలపై చర్చించారు. అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. పలువురు అధికారులు తదితరులు ఉన్నారు.

స్టిక్కర్లు వేస్తే చర్యలు తప్పవు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో సోమవారం ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. అనధికారికంగా వాహనాలపై పోలీస్, ఆర్మీ, ప్రెస్ పేరిట స్టిక్కర్లను వేసుకున్న వారితోనే వాటిని తొలగింపజేశారు. నిబంధనలు అతిక్రమించినందుకు జరిమానా విధించారు. వాహనదారులు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని ఆయన సూచించారు. సర్టిఫికెట్లు లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

తప్పిన ప్రమాదం

మంథని: పెద్దపల్లి–జయశంకర్ భూపాలపల్లి జిల్లా సరిహద్దులో గల అడవిసోమన్‌పల్లి వద్ద సోమవారం సాయంత్రం భారీ ప్రమాదం తప్పింది. మంథని నుంచి జయశంకర్ భూపాలపల్లి వైపు వెళ్తున్న డీజిల్ ట్యాంకర్ వంతెన రెయిలింగ్‌పైకి దూసుకెళ్లింది. అక్కడే ఆగిపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నార. మరికొద్ది దూరం వాహనం ముందుకెళ్తే వాగులో పడిపోయి భారీ ప్రమాదమే జరిగేదని వారు పేర్కొన్నారు.

గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

లైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): తన స్నేహితులలో కలిసి ఈనెల 26న గోదావరినదిలోకి స్నానం కోసం వెళ్లి గల్లంతైన సుదర్శి బాలరాజు మృతదేహం సోమవారం గోదావరినది కాళేశ్వరం సమీపంలోని అన్నారం గ్రామం వద్ద లభ్యమైనట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. నాలుగు రోజుల నుంచి పోలీసులు నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. గోదావరి నది పరీవాహక ప్రాంతమైన అన్నారం గ్రామం వద్దగల గోదావరి నదిలో బాలరాజు మృతదేహాన్ని కనుగొన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతుడి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

డీఎస్సీలో మెరిశారు

రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో పేదింటి కుసుమాలు మెరిశాయి. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని పలువురు వ్యవసాయ, పేద కుటుంబాలకు చెందినవారు మంచి మార్కులు సాధించి వారి కుటుంబాల్లో ఆనందం నింపారు. కొందరు వైకల్యాన్ని జయించి సత్తాచాటారు.

జిల్లాస్థాయిలో ఫస్ట్‌ర్యాంక్


రవికుమార్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని కోజన్‌కొత్తూర్‌కు చెందిన అయితే రవికుమార్ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. గ్రామానికి చెందిన అయితే రాములుకు ఇద్దరు కుమారులు. వీరిది వ్యవసాయ కుటుంబం. పెద్ద కుమారుడు మహేందర్ కొంత కాలం క్రితం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా ఎంపికయ్యాడు. రెండో కుమారుడైన రవికుమార్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీజీ(ఇంగ్లిష్) పూర్తి చేశాడు. డీఎస్సీలో ఎంపికతో గురుకుల పోస్టుకు రాజీనామా చేసి ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా జాయిన్ అవుతానని రవికుమార్ పేర్కొన్నారు.

పేద కుటుంబంలో విద్యాకుసుమం


రజిత

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని చీమల కుంటపల్లెకు చెందిన తాళ్లపెల్లి రజిత 7వ ర్యాంకు సాధించింది. తండ్రి రాజయ్యగౌడ్ కులవృత్తి, తల్లి రాధ కూలీ పనులు చేస్తుంటారు. 1 నుంచి 5వ తరగతి గ్రామంలో, 10వ తరగతి వరకు వడ్లూరుబేగంపేట్ ప్రభుత్వ పాఠశాలలో చదివింది. పదిలో 526 మార్కుల సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. ఇంటర్ గుండ్లపల్లి స్టేజీ వద్ద సద్గురు కళాశాల, డీఈడీ తిమ్మాపూర్ మండలం రామకృష్ణాకాలనీ జ్యోతిష్మతి (షాలినీ కాలేజీ ఆఫ్ ఎడ్యూకేషన్)లో పూర్తి చేసింది. టీఈటీలో 133 మార్కులు సాధించింది. డీఎస్సీలో జిల్లాలో ఏడో ర్యాంకుతో సత్తా చాటింది. కాగా ఐదేళ్ల క్రితం ఇల్లంతకుంటకు చెందిన అంతటి చందుగౌడ్‌తో వివాహం జరిగింది. భర్త ట్రావెల్స్ నిర్వహిస్తున్నాడు.

ధర్మపురి వాసుల ప్రతిభ

గొల్లపల్లి(ధర్మపురి): డీఎస్సీలో ధర్మపురి అభ్యర్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ తెలుగులో మాడిశెట్టి అభిషేక్ జిల్లా మొదటి ర్యాంక్, గడిపల్లి మమత ఎస్జీటీ విభాగంలో 11వ ర్యాంక్, మెరుగు రామచంద్రం తెలుగులో 4వ ర్యాంక్ సాధించారు. మొదటి ర్యాంక్ సాధించిన అభిషేక్ టైలర్ వృత్తి చేస్తున్నాడు.

పేదింటి బిడ్డకు రెండో ర్యాంకు


కుటుంబ సభ్యులతో కుమార్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని గంగారం గ్రామపంచాయతీ పరిధి ఊశన్నపల్లెకు చెందిన బండారి కుమార్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో రెండో ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు కొమురమ్మ–దుర్గయ్య వ్యవసాయ కూలీలు. ఒకటి నుంచి 10 వరకు ప్రభుత్వ స్కూళ్లల్లో చదివాడు. 2001–02లో పదిలో 524 మార్కులు సాధించగా, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్లు నరేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి ఇంటర్‌లో ఉచితంగా అవకాశం కల్పించారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ దూరవిద్యలో బీఎస్సీ, బీఈడీ, పీజీ చేశాడు. కరీంనగర్ డైట్‌లో టీటీసీ పూర్తి చేసి ఎస్జీటీగా కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాలలో ఉపాధ్యాయుడిగా చేరారు. తన తల్లిదండ్రుల కష్టాలు తెలిసిన వ్యక్తిగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల అభ్యుదయం కోసం కృషి చేస్తానని కుమార్ పేర్కొన్నాడు.

ఆరోసారికి దక్కిన విజయం


చంద్రశేఖర్

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేటకు చెందిన కోడం చంద్రశేఖర్ ఐదుసార్లు డీఎస్సీ రాసినా ఫలితం లేకపోవడంతో నిరాశ చెందలేదు. పట్టుదలతో ఆరోసారి రాసిన పరీక్షల్లో జిల్లా టాపర్‌గా నిలిచాడు. పేద చేనేత కుటుంబంలో జన్మించిన ఆయన ఎన్నో ఒడిదుడుకులను ఎదిరించారు. ప్రస్తుతం వేములవాడ బీసీ గురుకులంలో టీజీటీ సోషల్ సబ్జెక్టు బోధిస్తున్నాడు.

వ్యాయామ విద్యా విభాగంలో..


అఖిల్

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ జిల్లా చింతకుంటకు చెందిన వి.పూర్ణసాయి అఖిల్ వ్యాయామ విద్య విభాగంలో 55 మార్కులు సాధించి జిల్లాలో 2వ ర్యాంకు సాధించాడు. అఖిల్‌ను జిల్లా క్రీడలు యువజన అధికారి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రమేశ్‌రెడ్డి, మహ్మద్ కరీం, ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, కోశాధికారి సిద్ధారెడ్డి అభినందించారు.

సామాన్య కుటుంబం నుంచి..


నివేదితరెడ్డి


ప్రజ్ఞారెడ్డి


నాగరాజు


నరేందర్‌రాజు

మల్లాపూర్(కోరుట్ల): సామాన్య కుటుంబానికి చెందిన పలువురు డీఎస్సీ ఫలితాల్లో మెరిశారు. మండలంలోని చిట్టాపూర్‌కు చెందిన గుగ్గిళ్ల గంగారాం–లక్ష్మి దంపతుల కుమారుడు నాగరాజు ఎస్జీటీ విభాగంలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. అదే గ్రామానికి చెందిన గణపతి నరేందర్‌రాజు స్కూల్ అసిస్టెంట్(సోషల్) విభాగంలో జిల్లా సెకండ్ ర్యాంక్ సాధించాడు. అలాగే నడికుడ గ్రామానికి చెందిన కోరిపెల్లి నర్సారెడ్డి–కాంతమ్మ దంపతుల కుమార్తె నివేదిత ఎస్జీటీ విభాగంలో 4వ ర్యాంక్, అదే గ్రామానికి చెందిన కోరిపెల్లి ప్రజ్ఞ ఎస్జీటీలో 77వ ర్యాంక్ సాధించారు.

మొదటి ప్రయత్నంలోనే సక్సెస్


తల్లిదండ్రులతో శ్రీకాంత్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మామిడిపల్లికి చెందిన బెదిరె శ్రీకాంత్ డీఎస్సీలో మొదటి ప్రయత్నంలోనే విజయం అందుకున్నాడు. జిల్లా స్థాయిలో ఫస్ట్‌ర్యాంక్ సాధించాడు. గ్రామానికి చెందిన బెదిరె కుంటయ్య–మీన దంపతుల కుమారుడు శ్రీకాంత్‌ను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

అంధత్వాన్ని జయించి..


రేవతి

సిరిసిల్ల ఎడ్యుకేషన్: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేటకు చెందిన పాతూరి రేవతి డీఎస్సీ ఫలితాల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ విభాగంలో జిల్లా రెండో ర్యాంకు సాధించింది. పేద వ్యవసాయ కుటుంబానికి చెందిన పాతూరి శ్రీనివాస్‌రెడ్డికి ఇద్దరు కూతుర్లు. చిన్నమ్మాయి రేవతి పుట్టుకతో వంద శాతం అంధత్వం. మూడో తరగతి వరకు గ్రామంలో చదివింది. బాబాయ్ పాతూరు మహేందర్‌రెడ్డి ఉపాధ్యాయుడు కావడంతో రేవతిలో ఉన్న జ్ఞానాన్ని గ్రహించి కరీంనగర్‌లోని అంధుల పాఠశాలలో చేర్పించారు. హైదరాబాద్‌లో ఇంటర్, గ్రాడ్యుయేషన్, టీటీసీ(డీఎడ్) పూర్తి చేసింది. టెట్‌లో మంచి మార్కులు పొంది ప్రస్తుతం డీఎస్సీలో జిల్లాలో రెండో ర్యాంకు సాధించింది. తన తండ్రి, అక్క, బావ ప్రోత్సాహంతో ఇది సాధ్యమైనట్లు తెలిపింది.

అంగన్‌వాడీ కేంద్రాలు ఆదర్శంగా నిలవాలి


పోషణ జాతర బుక్‌లెట్స్ ఆవిష్కరిస్తున్న మంత్రులు సీతక్క, ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి, కలెక్టర్లు

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- మానకొండూర్‌లో 'పోషణ ఆరోగ్య జాతర' ప్రారంభం

మానకొండూర్/కరీంనగర్: పూర్వ ప్రాథమిక విద్య నందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు దేశంలోనే ఆదర్శ నిలవాలని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం కరీంనగర్ ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్లలో నూతన సిలబస్‌తో విద్య, నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని తల్లిదండ్రులకు చెప్పాలని, పిల్లలను పంపేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరుకుల్లో నాణ్యత లేకుంటే కాంట్రాక్టర్ల అనుమతులు రద్దు చేయాలన్నారు. పంచాయతీరాజ్ శాఖలో పెండింగ్ బిల్లుల అంశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టిలో ఉందన్నారు. బతుకమ్మ వేడుకలుకు ఏర్పాట్లు చేయాలన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నవారికి ఈ నెల 4, 5వ తేదీల్లో హైదరాబాద్‌లో అభినందన సభ నిర్వహిస్తామని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, గ్రామీణాభివృద్ధి కమిషనర్ అనితా రామచంద్రన్, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్, పెద్దపల్లి కలెక్టర్ శ్రీహర్ష, రాజన్నసిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కరీంనగర్ అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్, మహిళా కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులను ముంచింది మీరు కాదా?

అక్రమ కట్టడాల్లో ఎవరెవరు ఉన్నారో ముందుగా లీడర్ల లిస్టు తీయాలని, తర్వాత పేదలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మూసీ నది అథారిటీ, హైడ్రాకు సూచించారు. సోమవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలో పోషణ ఆరోగ్య జాతర కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ప్రిన్సిపల్ సెక్రటరీ కరుణ, కలెక్టర్ ప్రమేలా సత్పతిలతో కలిసి ప్రారంభించారు. చిన్నారులతో ముచ్చటించారు. వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. కలెక్టర్ పమేలా సత్పతి డిఫరెంట్‌గా చేస్తున్న ప్రోగాంలను చూశామని, ఆమెను అభినందించారు. మూసీనది ప్రక్షాళన పేరిట దోపిడీకి పాల్పడ్డారని ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను ఖండించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట లక్షన్నర కోట్లు దోచుకుందెవరో దేశ ప్రజలందరికీ తెలుసన్నారు. మిడ్‌మానేరు, మల్లన్న సాగర్, భువనగిరి ఫ్లై ఓవర్ బాధితులను ముంచిది మీరు కాదా అని ప్రశ్నించారు. వీటిపై మాట్లాడేందుకు మల్లన్నసాగర్, మిడ్‌మానేరుకు రావాలని కేటీఆర్, హరీశ్‌రావులకు సవాల్ విసిరారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదలకు న్యాయం చేయాలనే ఆలోచనతో ఉన్నారని పేర్కొన్నారు.

వృథా వస్తువులకు కళాకృతి

- స్వశక్తి మహిళల సృజనాత్మకత
- బల్దియాలో ప్రదర్శించిన స్వశక్తి మహిళలు


కళాత్మక వస్తువులు పరిశీలిస్తున్న అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలోని స్వశక్తి మహిళలు పనికిరాకుండా పోయిన వస్తువులను వృథాగా పడేయకుండా సృజనాత్మకత జోడించి అందంగా తీర్చిదిద్దారు. వాటిని పనికివచ్చేలా కళాత్మకంగా రూపొందించి వావ్ అనిపించారు. స్వచ్ఛతా హీ సేవా–2024లో భాగంగా సోమవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ‹వేస్ట్ టు ఆర్ట్› పేరిట వస్తువుల ప్రదర్శన నిర్వహించారు. పనికిరాని వస్తువులను వృథా చేయకుండా పనికివచ్చే వస్తువులు రూపొందించవచ్చని గతంలో స్వశక్తి మహిళలకు అధికారులు అవగాహన కల్పించారు. దీంతో ప్రభావితులైన కొందరు మహిళలు తయారు చేసుకొచ్చిన వస్తువులను నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ప్రదర్శించారు. వస్తువులను తయారు చేసిన స్వశక్తి మహిళలను బల్దియా అధికారులు అభినందించారు. అలాగే గౌతమినగర్‌లోని డ్రై రీసోర్స్ సెంటర్ ఆవరణలో మొక్కలు నాటారు. నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, హెల్త్ అసిస్టెంట్ సునీల్ రాథోడ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

- తన చావుకు ఎవరూ కారణం కాదంటూ సూసైడ్ నోట్
- ఉరివేసుకుని అఘాయిత్యం


గంగ ఊరఫ్ కీర్తీశ (ఫైల్)

చందుర్తి (వేములవాడ): భార్య కాపురానికి వస్తే చనిపోతానన్న భర్త మాటలు... ప్రియుడితో కలిసి బతుకలేకపోతున్నానని మనస్థాపానికి గురైన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన చందుర్తి మండలం లింగంపేటలో విషాదం నింపింది. స్థానికులు తెలిపిన వివరాలు. చందుర్తి మండలం లింగంపేటకు చెందిన గంగ(21) ఊరఫ్ కీర్తీశకు వేములవాడఅర్బన్ మండలంలోని ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన దేవరాజుతో 2023 మే 13న వివాహమైంది. ఏడాదిపాటు సంసారం సాఫీగా సాగింది. భార్యభర్తల మధ్య మనస్థాపాలు రావడంతో పుట్టింటికొచ్చింది. గత జూన్ 2వ తేదీన అత్తారింటికి వెళ్తున్నానని చెప్పి బయలుదేరింది. అత్తారింటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు మరుసటి రోజు చందుర్తి ఠాణాలో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గత జూన్ 18వ తేదీన హైదరాబాద్ నుంచి పోలీసులు ఇంటికి తీసుకొచ్చారు. తిరిగి అత్తగారింటికి కాపురానికి వెళ్లింది. అయితే ఆమెలో మార్పు రాకపోగా ఇతరులతో ఫోన్‌లో మాట్లాడుతుండడంతో వివాదం ముదిరింది. దీంతో నెల రోజుల క్రితమే పుట్టింటికి చేరుకుంది. కొద్ది రోజులుగా గొడవలతో దూరంగా ఉంటున్న క్రమంలో తాజాగా ఆదివారం పంచాయితీ పెట్టారు. భార్యను కాపురానికి తీసుకొస్తే తాను చనిపోతానని భర్త దేవరాజు అనడంతో మనస్థాపానికి గురైంది. ఈక్రమంలో ఇంట్లోనే ఉరివేసుకుంది. మృతురాలు తల్లి మంజుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బాపు తెలిపారు. మృతురాలు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే ప్రియుడిని తలచుకుంటూ మూడు పేజీల సూసైడ్‌నోట్ రాసింది.

చిన్నారిని చిదిమేసిన స్కూల్ బస్సు

- టైర్ ఎక్కడంతో నుజ్జునుజ్జయిన తల భాగం
- అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన చిన్నారి
- ముందస్తు బతుకమ్మ సంబరాలు విషాదాంతం
- పిల్లలు లేక మనోజ్ఞను దత్తత తీసుకున్న దంపతులు


మనోజ్ఞ(ఫైల్)


మనోజ్ఞ మృతదేహం

ముస్తాబాద్(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో సోమవారం ఓ ప్రైవేటు స్కూల్ బస్సు కింద పడి ఐదేళ్ల విద్యార్థిని దుర్మరణం చెందింది. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన సల్కం భూమయ్య–వెంకటలక్ష్మి దంపతుల దత్తత కూతురు మనోజ్ఞ(5) ముస్తాబాద్‌లోని మహర్షి స్కూల్‌లో నర్సరీ చదువుతోంది. పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా, మనోజ్ఞ స్కూల్‌బస్సులో పాఠశాలకు చేరుకుంది. పిల్లలు, అటెండర్ బతుకమ్మ పూలు తీసుకుని తరగతి గదిలోకి వెళ్లగా.. బస్సు దిగిన మనోజ్ఞ.. అక్కడే కింద పడి ఉన్న బతుకమ్మ పూలను తీసేందుకు వంగింది. ఇది గమనించని డ్రైవర్ గురుమూర్తి బస్సును ముందుకు కదిలించాడు. మనోజ్ఞ తలపై నుంచి టైరు వెళ్లడంతో చిన్నారి అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. తల భాగం నుజ్జునుజ్జయ్యింది. డ్రైవర్ గురుమూర్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పెంచిన పేగు తల్లడిల్లింది

సంతానం కలగని భూమయ్య–వెంకటలక్ష్మి దంపతులు సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం మల్లయ్యపల్లె నుంచి సమీప బంధువుల కూతురు మనోజ్ఞను దత్తత తీసుకుని పెంచుకుంటున్నారు. మనోజ్ఞ జన్మించిన మూడు రోజులకే కన్నతల్లి కన్నుమూయగా, సంతానం లేని భూమయ్య దంపతులకు దత్తత ఇచ్చారు. ఉపాధి నిమిత్తం భూమయ్య దుబాయ్ వెళ్లగా, పెంచుకున్న కూతురు బస్ ప్రమాదంలో మృతి చెందడంతో కడసారి చూపునకు నోచుకోలేకపోయాడు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే మనోజ్ఞ మృతి చెందిందని విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. సిరిసిల్ల ఆర్డీవో రమేశ్, డీఈవో రమేశ్‌కుమార్, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ఆందోళన చేస్తున్న వారిని శాంతింపజేశారు. పాఠశాలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్కూల్‌ను సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

ఓటరు జాబితాలో చేరాలి

- బీఎన్.రావు హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎన్.రావు


దరఖాస్తు ఫాంలు అందిస్తున్న బీఎన్.రావు

కరీంనగర్: ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ఉండాలంటే.. ప్రతిఒక్కరూ కచ్చితంగా ఓటరుగా నమోదై ఉండాలని బీఎస్.రావు హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎన్.రావు అన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను సోమవారం కరీంనగర్‌లో ప్రారంభించారు. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రితోపాటు పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లోని వైద్యులను కలిసిన ఆయన త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించారు. ఐదేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో ఓటుహక్కును చాలా తక్కువ మంది పొందారని, ఈసారి నమోదు ప్రక్రియపై అన్ని వర్గాల ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 2021 నవంబర్ నాటికి డిగ్రీ పట్టా కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో చేరాలన్నారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌తోపాటు తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫాం–18ను నింపే విధానం, అవసరమైన పత్రాల గురించి తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. పట్టభద్రులు ఒక మంచి నాయకుడికి ఓటు వేసి, ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో మహిళ బలవన్మరణం

పాలకుర్తి(రామగుండం): అనారోగ్యం బాధ భరించలేక, జీవితంపై విరక్తి చెంది ఓ మహిళ ఆదివారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బసంత్‌నగర్ కేశోరాం స్టాఫ్ కాలనీలో జరిగింది. ఎస్సై స్వామి కథనం ప్రకా రం.. కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో జూనియర్ ఇంజినీర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ భార్య చిట్టిమల్ల చైతన్య(40) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి మామిడాల సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొలనూర్‌లో ఆటో చోరీ

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి కొలనూర్‌లోని స్టేషన్‌రోడ్డులోగల గట్టు సదికి చెందిన ఆటో ఆదివారం రాత్రి చోరీకి గురైంది. రోజూ మాదిరిగానే పనులు ముగించుకొని ఇంటిముందు పార్కింగ్ చేసిన ఆటో సోమవారం కనిపించలేదు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువకుడి మృతదేహం లభ్యం

గొల్లపల్లి(ధర్మపురి): ధర్మపురి మండలం రాయపట్నం గోదావరినదిలో గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు నదిలో స్నానం చేస్తూ గల్లంతు కాగా.. జాలర్ల సాయంతో ఇద్దరు ప్రాణాలతో బయటపడిన విషయం తెలిసిందే. పవన్‌కుమార్ ప్రవాహంలో కొట్టుకుపోయాడు. పోలీసులు గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు.కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డెంగీతో పదేళ్ల బాలిక మృతి

హుజూరాబాద్: డెంగీ బారిన పడి బాలిక మృతిచెందిన ఘటన సోమవారం హుజూరాబాద్ పట్టణం విద్యానగర్‌కాలనీలో సోమవారం జరిగింది. స్థానికుల వివరాలు.. విద్యానగర్‌కు చెందిన రావుల వెంకటేశ్వర్లు కుమార్తె రిషిత(10)కు నాలుగురోజుల క్రితం జ్వరం రావడంతో స్థానిక వైద్యుడికి చూపించారు. జ్వరం తగ్గకపోవడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్లేట్‌లెట్స్ పూర్తిగా పడిపోవడంతో పాటు రిషితకు హఠాత్తుగా గుండెపోటు రావడంతో సోమవారం మృతిచెందింది.